Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

సోమవారం 17/08/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## గుంటూరు మిర్చిని తిరస్కరించిన శ్రీలంక

### తేమ శాతం ఎక్కువ ఉన్నట్లు ధ్రువీకరణ



**టీ మీడియా , ఆగష్టు 16 , గుంటూరు :** గుంటూరు నుంచి ఎగుమతైన మిర్చిని శ్రీలంక తిరస్కరించింది. అఫ్లోటాక్సిన్‌తో పాటు తేమ శాతం ఎక్కువగా ఉండటమే దీనికి కారణమని భావిస్తున్నారు. జూన్ నెలలో మూడు కంటైనర్లను చైనా తిరస్కరించగా, ఇప్పుడు శ్రీలంక పదుల సంఖ్యలో కంటైనర్లను వెనక్కు పంపాలని ఆదేశించింది. శ్రీలంక వెళ్లిన ఎగుమతి వ్యాపారులు అక్కడి అధికారులతో చర్చిస్తున్నారు. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాణాలు పెంచటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిణామం మిర్చిమార్కెట్‌ను ప్రభావితం చేసే అవకాశమంది.మిర్చి ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంటుంది. ప్రత్యేకించి గుంటూరు యార్డు మిర్చి లావాదేవీలకు కేంద్రబిందువు. ఇక్కడకి రైతులు తెచ్చిన పంట కొన్న వ్యాపారులు దేశీయ మార్కెట్లతో పాటు విదేశాలకు ఎగుమతి చేస్తారు.

# చేయూత పింఛన్లకు శ్రీకారం

- మంజూరు పత్రాలు అందజేసిన సీఎం
- వనదేవతలను దర్శించుకున్న రేవంత్ రెడ్డి

**టీ మీడియా , ఆగష్టు 16 ,ములుగు :**
వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి, రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క– సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చదువు ఒక్కటే ఉద్యోగాన్ని ఇవ్వదని, స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, ఇంటర్ తర్వాత విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. నైపుణ్యం





ఉన్నవారికి జర్మని, జపాన్, కొరియాలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు జర్మని, జపాన్, కొరియన్ భాషలు నేర్పిస్తామని తెలిపారు.

**సమీకృత కలెక్టరేట్ ప్రారంభం**

ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఆవిష్కరించిన సీఎం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రులతో కలిసి పరిశీలించారు. సీఎం సమక్షంలో కలెక్టర్ హేమంత్ బోర్ఖడే కొత్త కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ హేమంత్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

**వనదేవతలను దర్శించుకున్న రేవంత్ రెడ్డి**

అంతకు ముందు ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలను సీఎం రేవంత్ సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వన దేవతల సమక్షంలో సీఎం, మంత్రులకు సీతక్క రాఖీలు కట్టారు.

అనంతరం ఒంటరి మహిళలు, వితంతువుల కోసం ఉద్దేశించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మేడారం వేదికగా ప్రారంభించారు. ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం, పలువురికి (మిగతా 2లో)

# డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి

**క్షిపణులతో రివర్స్ ఎటాక్ చేసిన మాస్కో**

**హోరాహోరీగా సాగుతున్న యుద్ధం**



**టీ మీడియా , ఆగష్టు 16 , ఢిల్లీ బ్యూరో :**
రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం హోరాహోరీగా సాగుతోంది. పరస్పర దాడులతో ఇరు దేశాలు దద్దరిల్లుతున్నాయి. వందలాది డ్రోన్లతో ఉక్రెయిన్ చేసిన దాడుల్లో రష్యాలో ఆరుగురు మృతిచెందారు. పలు పట్టణాల్లో భీకర నష్టం వాటిల్లింది. రాత్రికి రాత్రే ఉక్రెయిన్ రాజధానిపై మాస్కో క్షిపణుల వర్షం (మిగతా 2లో)

## హుషారుగా జెండా పండుగలో

▶▶| **తెల్లారేసరికి ఆఫీస్‌లో విగతజీవిగా**

**టీ మీడియా , ఆగష్టు 16 , ఢిల్లీ బ్యూరో :**
బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర విషాదం వెలుగుచూసింది. తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం స్వాతంత్ర్య దినోత్సవ స్థానికంగా వేడుకల్లో పాల్గొని హుషారుగా కనిపించిన ఆయన ఆదివారం తెల్లవారుజామున రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న టీఎంసీ కార్యాలయంలో ఉరివేసుకొని విగతజీవిగా కనిపించారు. అది గమనించిన



సిబ్బంది వెంటనే ఆయన కుటుంబ సభ్యులలో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు.దీంతో వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఆయన మృతదేహం పక్కనే (మిగతా 2లో)




# ప్రైవేట్ భూములకూ '22 ఏ' చిక్కులు

▶▶| **రిజిస్ట్రేషన్లు నిలిపేస్తున్న ప్రభుత్వ మూల సర్వే నంబర్లు**

**టీ మీడియా , ఆగష్టు 16 , హైదరాబాద్ బ్యూరో :**
రాష్ట్రంలో 22 ఏ(నిషేధిత భూములు) జాబితాలోకి ప్రైవేట్ భూములు, ఆస్తులు కూడా చేరడం వల్ల వాటి యజమానులలో గందరగోళం నెలకొంది. విద్య, వివాహాల వంటి అత్యవసర అవసరాల కోసం ఈ స్థిరాస్తులను విక్రయించడానికి, తాకట్టు పెట్టడానికి వీలు లేకుండా పోవడంతో వాటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతుండటంతో ఇటీవలి పరిణామాలు వారిలో ఆందోళనను పెంచుతున్నాయి. అయితే భూ భారతి పోర్టల్ నిర్వహణకు, 22 ఏ జాబితాకు ఎటువంటి సంబంధం లేదని గమనించాలి. వ్యవసాయ లేదా వ్యవసాయేతర భూములైనా నిషేధిత జాబితాలో ఉంటే రిజిస్ట్రేషన్ చేయడం కుదరదు.

**ఇప్పుడే ఎందుకు జరుగుతోంది?**

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవ్వడం, రిజిస్ట్రేషన్ల ద్వారా చేతులు మారడం వంటి వివాదాలను గమనించిన హైకోర్టు నిషేధిత భూముల జాబితాను నవీకరించాలని డిసెంబర్ 2015లో ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2024లో కూడా ఇలాంటి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ 2025 చివర్లో ప్రభుత్వ భూముల వివరాలను నవీకరించి వాటిని నిషేధిత జాబితాలో చేర్చింది. ఆర్డీవో, తహసీల్దార్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ సంతకాలతో కూడిన జాబితాలను రూపొందించి రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో అధికారులు అప్‌లోడ్ చేశారు. ఈ జాబితా ఆధారంగా అందులో ఉన్న సర్వే నంబర్లకు సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను రిజిస్ట్రేషన్ శాఖ నిలిపివేస్తోంది.

**గందరగోళానికి కారణాలివే**

వేలం ద్వారా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన ఆస్తులు, క్రమబద్ధీకరణ ప్రక్రియ ద్వారా పట్టాలు పొందిన భూములు, అలాంటి తదితరాలను ప్రైవేట్ ఆస్తులుగా పరిగణించాలి. రెవెన్యూ రికార్డులు ఆయా భూముల మూల సర్వే నంబర్లను ప్రభుత్వ ఆస్తిగానే చూపుతున్నాయి. అయితే రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం బైనంబర్లు, లేఅవుట్ ప్లాట్ నంబర్లను ఉపయోగించి రిజిస్ట్రేషన్లు, యాజమాన్య బదిలీలను చేపడుతూ వస్తోంది. ఇప్పుడు ప్రభుత్వ సర్వే నంబర్లన్నీ 22 ఏ జాబితాలో చేరడంతో మూల సర్వే నంబర్లకు అనుసంధానంగా ఉండే భూములు కూడా నిషేధిత జాబితాలోకి వచ్చాయి.



హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్?సీ) భూములు ప్రధాన సమస్యగా మారాయి. పట్టా భూముల్లో ఈ పరిధిలోకి వచ్చే భూమి ఉండటం వల్ల ఆ మొత్తం స్థలానికే ముప్పు వాటిల్లుతోంది.అసైన్డ్ భూములు, ఇనాం భూములు, చెరువు శిఖం, బఫర్ జోన్లకు సంబంధించిన సర్వే నంబర్ల నుంచి ప్రైవేట్ భూములను వేరు చేయకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.కోర్టు ఆదేశాల ద్వారా రిజిస్ట్రేషన్లు పూర్తయినప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో ఆయా భూములకు సంబంధించిన మార్పులు నమోదు చేయకపోవడం మరో సమస్యగా మారుతోంది. అంతేకాకుండా 166, 59 జీవోల కింద క్రమబద్ధీకరణ ద్వారా రిజిస్టర్ అయిన ప్లాట్ల సర్వే నంబర్లను కూడా రికార్డుల నుంచి తొలగించకపోవడంతో అవి నిషేధిత ఆస్తుల జాబితాలో చేరిపోయాయి.

**ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు**

నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలు వెలుగులోకి వస్తుండటంతో జిల్లా కలెక్టర్లు ఆయా భూముల జాబితాలపై పరిశీలన ప్రారంభించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఇటువంటి పరిస్థితులు ఎక్కడ తలెత్తాయో గుర్తిస్తూ సంబంధిత సమాచారాన్ని సేకరిస్తున్నారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నారు. రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహిస్తూ ఆ వివరాలను ప్రభుత్వానికి సమర్పిస్తున్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్న తర్వాత సమస్య పరిష్కారం కానుంది.

**పట్టా భూములు 22 ఏలో చేరడంతో పలు ప్రాంతాల్లోని సమస్యలు ఇలా ఉన్నాయి**

సరూర్‌నగర్ మండలంలో సర్వే నంబర్ 39లోని భూమి 22 ఏలో ఉండటం వల్ల ఓ ఇంటి రిజిస్ట్రేషన్‌కు తిరస్కరించారు. ఆ ఇల్లు సర్వే నంబర్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోకి రావడం వల్లే 22 ఏ జాబితాలో చేరిందని గుర్తించారు. అదే మండలంలో 19/పీ నుంచి 46 వరకు ఉన్న అనేక సబ్? నంబర్లు 22 ఏ జాబితాలో చేరాయి.వికారాబాద్‌లోని ఎన్నెపల్లి, శివారెడ్డిపేట, ఆలంపల్లి, లంకా ప్రతాప్ రెడ్డి కాలనీ ప్రాంతాల్లోని వివిధ ప్లాట్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, నివాసాలు కూడా నిషేధిత జాబితాలో చేరాయి.ఉప్పల్, నారపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోకి వచ్చే నారపల్లి, మేడిపల్లి, రామంతాపూర్, ఉప్పల్ భగాయత్‌తో పాటు చాలా ప్రాంతాల్లోని సర్వే నంబర్లలోని ఆస్తులు ప్రస్తుతం రిజిస్ట్రేషన్ జరగడం లేదు.

**రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, భువనగిరి జిల్లాలతో పాటు గ్రామీణ జిల్లాల నుంచి కూడా 22 ఏ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ప్రభుత్వ భూ సర్వే నంబర్లతో అనుసంధానంగా ఉన్న భూదాన్, అసైన్డ్, భూ పంపిణీ, సీలింగ్ భూముల పట్టా భూముల విషయంలోనే ఈ సమస్యలు తలెత్తుతున్నట్లు అధికారులు గుర్తించారు.**

# చేయూత పింఛన్లకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)
కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. అనంతరం మేడారం ప్రాంగణంలో మొక్కలు నాటిన రేవంత్ రెడ్డి మహిళలతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

**హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం**

మేడారం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గట్టమ్మ ఆలయం వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. దీని ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని గ్రామాల రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. మొదటి విడతగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.16 వేల కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. మూడు దశల్లో 18 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.

# హుషారుగా జెండా పండుగలో

(మొదటి పేజీ తరువాయి)
పోలీసులకు ఒక సూసైడ్ నోట్ కూడా దొరికింది. అందులో తన రాజకీయ జీవితంలో తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఎటువంటి తప్పు చేయలేదని బెనర్జీ రాసుకొచ్చారు.ఇక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ఘటనపై కేసు నమోదు చేసి.. ఆయన మృతికి గల ఖచ్చితమైన కారణాలు తేల్చేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

**బెనర్జీ రాజకీయ నేపథ్యం**

తృణముల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆశిష్ బెనర్జీ రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి 2001 నుంచి 2026 వరకు వరుసగా 25 ఏళ్ల పాటు ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి తనదైనా హవా కొనసాగించారు. అయితే, 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ధ్రుబ సాహా చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు.

# డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి

(మొదటి పేజీ తరువాయి)
కురిపించింది. పుతిన్ సేనల దాడిలో భారీగా విధ్వంసం జరిగింది.రష్యా, ఉక్రెయిన్ మధ్య దాదాపు నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆదివారం వందలాది డ్రోన్లతో రష్యా అంతటా ఉక్రెయిన్ దాడులు చేసింది. కీవ్ చేసిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఒకటైన ఈ ఘటనలో రష్యాలో ఆరుగురు మరణించారు. రాత్రికి రాత్రే ఉక్రెయిన్ ప్రయోగించిన 822 డ్రోన్‌లను తాము ధ్వంసం చేశామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దాదాపు 600 డ్రోన్లు రాజధాని మాస్కో వైపు దూసుకురాగా, వాటిలో మూడింట ఒక వంతు డ్రోన్లను మాస్కో ప్రాంతంలోనే ధ్వంసం చేసినట్లు మేయర్ సెర్గీ సోబ్యానిన్ చెప్పారు. నైరుతి రష్యాలో రోస్టోవ్ ప్రాంతంలో 150కిపైగా డ్రోన్లతో 3 పట్టణాలపై ఉక్రెయిన్ చేసిన దాడిలో ఐదుగురు మరణించారని స్థానిక గవర్నర్ యూరీ స్ల్యూసర్ తెలిపారు. దాడిలో ఇళు ్ల, రైల్వే స్టేషన్ దెబ్బతిన్నాయి. అడవిలో మంటలు చెలరేగాయి. మాస్కో ప్రాంతంలో ఒక డ్రోన్ ప్రైవేట్ ఇంటిని ఢీకొట్టి 83 ఏళ్ల వృద్ధుడు మరణించాడు. ఈ ఏడాది ఉక్రెయిన్ తన దాడుల తీవ్రతను పెంచింది. సైనిక, ఇంధన కేంద్రాలతో పాటు రష్యాకు చెందిన భారీ ఆన్‌లైన్ రిటైల్ సంస్థ 'వైల్డ్‌బెర్రీస్' గోదాములను లక్ష్యంగా చేసుకుంది. పోడోల్స్క్ పట్టణంలో జరిగిన దాడి వల్ల బిలియన్ల కొద్దీ డాలర్ల విలువైన సరుకు కాలి బూడిదైంది.

**క్షిపణులతో విరుచుకుపడిన రష్యా**

ఉక్రెయిన్ దాడులకు ప్రతిస్పందనగా రష్యా జరిపిన దాడుల్లో ఉక్రెయిన్‌లో ఐదుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. క్రివీ రిహ్ నగరంపై రష్యా జరిపిన క్షిపణి దాడిలో ఇద్దరు మృతిచెందారు. 14 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ వెల్లడించారు. సుమీ నగరంలో ఒకరు మృతిచెందగా, జపోర్‌ఝాజియాలో ఇల్లు ధ్వంసమై ఒక పురుషుడు, మహిళ మరణించారు. రాజధాని కీవ్‌లో జరిగిన దాడుల్లో మంటలు చెలరేగి ఆరుగురు గాయపడ్డారు. క్రివీ రిహ్‌లోని ఒక మెటలర్జికల్ ప్లాంట్, కీవ్‌లోని ఫ్లెమింగో క్షిపణుల తయారీ కేంద్రం వంటి సైనిక–పారిశ్రామిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. ఉక్రెయిన్ దేశీయంగా తయారు చేసిన ఫ్లెమిగో క్షిపణులను రష్యాపై సుదూర దాడులకు ఉపయోగిస్తోంది. ఉక్రెయిన్ సరిహద్దు నుండి సుమారు 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న రష్యాలోని సమారా రాకెట్ పరిశోధన కేంద్రంపై దాడికి ఈ ఆయుధాలనే వాడినట్లు జెలెన్‌స్కీ శనివారం ప్రకటించారు.మరోవైపు రొమేనియా గగనతలంలోకి ప్రవేశించిన ఒక డ్రోన్‌ను స్పానిష్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎఫ్?–18 ఫైటర్ జెట్ ఆదివారం ఉదయం కూల్చివేసింది. మాల్డోవా సరిహద్దు సమీపంలోని తూర్పు నగరమైన గలాటికి ఉత్తరాన ఉదయం డ్రోన్ ప్రవేశాన్ని రాడార్లు గుర్తించాయి. అయితే ఇది ఏ దేశానికి చెందిన డ్రోన్ అనేది అధికారులు వెల్లడించలేదు.గత నెలలో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో రష్యా భీకర దాడులకు పాల్పడింది. రష్యా దాడులతో కీవ్ నగరం గంటల తరబడి బాంబుల మోతలతో దద్దరిల్లింది. పలు నివాస భవనాలు ధ్వంసం కాగా 8 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. భయాందోళనలకు గురైన ప్రజలు బంకర్లు, మెట్రో స్టేషన్లలో తలదాచుకున్నారు. ఇది శత్రువులు చేస్తున్న అత్యంత క్రూరమైన దాడి అని కీవ్ మేయర్ అభివర్ణించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఉక్రెయిన్? డ్రోన్లతో రష్యాపై విరుచుకుపడింది.

# బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ




## ● అటవీ అధికారి నవీన్ కుటుంబానికి ఓదార్పు

**టీ మీడియా,ఆగస్టు16,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో వైరా మాజీ శాసనసభ్యుడు లావుడియా రాములు నాయక్ ఆదివారం పర్యటించి ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు.బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ముందుగా మండలంలోని వెంకట్యాతండాకు వెళ్లిన రాములు నాయక్,ఇటీవల విధి నిర్వహణలో మృతి చెందిన అటవీ శాఖ అధికారి బానోత్ నవీన్ కుటుంబాన్ని పరామర్శించారు.నవీన్ తండ్రి,సింగరేణి మాజీ ఎంపీపీ బానోత్ దేవుల నాయక్ను కలిసి ఓదార్చారు.నవీన్ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.అనంతరం నవీన్ సతీమణి,పిల్లలతో కొద్దిసేపు మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు.కుటుంబం ధైర్యంగా ఉండాలని,అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.అనంతరం చిన్నకట్టుగూడెం గ్రామానికి చెందిన మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్,జర్నలిస్టు రాము నాయనమ్మ అంజి ఇటీవల మృతి చెందగా,ఆమె దశదిన కార్యక్రమానికి రాములు నాయక్ హాజరయ్యారు.అంజి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడ్డగోడ ఐలయ్య,సర్పంచ్ ధారావత్ మంగీలాల్,ఆడప పుల్లారావు,మాజీ సర్పంచ్ బానోత్ శంకర్,భగవాన్ దాస్,వాంకుడోత్ కృష్ణ,అజ్మీర వీరన్న,డాక్టర్ బాబులాల్, గోపాల్, గుగులోత్ నవీన్,యుగంధర్,రవి, బానోత్ చక్రం, మాజీ ఎంపిటీసీ లాలు,బుచ్చిరాంతో పాటు గ్రామ యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌పీజీ ఉత్పత్తికి కేంద్రం కొత్త లక్ష్యాలు



## ● రిలయన్స్‌కు అత్యధిక కోటా

**టీ మీడియా , ఆగస్టు 16 , ఢిల్లీ బ్యూరో :**
పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో వంటగ్యాస్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలోనే కేంద్రం భవిష్యత్తులో విదేశీ దిగుమతులు దెబ్బతిన్నా ఎల్?పీజీ కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు రిఫైనరీలు చమురు ఉత్పత్తి సంస్థలకు తొలిసారిగా ప్లాంట్ వారీగా గరిష్ఠ ఎల్?పీజీ ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించింది. మొత్తం 21 రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ సంస్థలు కలిసి రోజుకు గరిష్ఠంగా 63,810 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ తెలిపింది. దేశీయ సరఫరాలో కొరత ఏర్పడినప్పుడల్లా ఉత్పత్తి పరిమితులు అమల్లోకి వస్తాయి.

**రిలయన్స్‌కు అత్యధిక లక్ష్యం**

ఉత్తర్వులు ప్రకారం, అత్యధిక భాగం ప్రముఖ వ్యాపార సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్?కు ఉంది. గుజరాత్‌లోని జామ్‌నగర్ దేశీయ మార్కెట్ కోసం పనిచేసే రిఫైనరీ రోజుకు 18 వేల టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అదే జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్‌కు చెందిన ఎగుమతి ఆధారిత మరో రిఫైనరీకి మాత్రం ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదు. ఈ ప్లాంట్ ఉత్పత్తి ప్రధానంగా విదేశీ మార్కెట్లకు వెళ్తుంది. రష్యాకు చెందిన రోస్?నెఫ్ట్? మద్దతు ఉన్న నయారా ఎనర్జీకి చెందిన గుజరాత్ వడినార్ రిఫైనరీకి రోజుకు 4,480 టన్నుల ఎల్?పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని కేంద్రం నిర్ణయించింది.

**ప్రభుత్వ రంగ సంస్థలకు 31,470 టన్నులు**

ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు చెందిన 18 రిఫైనరీలు కలిపి రోజుకు 31,470 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. సహజవాయువు నుంచి ఎల్పీజీ తయారు చేసే ఓఎన్‌జీసీ, గెయిల్ వంటి అప్‌స్ట్రీమ్ సంస్థలకు కలిపి రోజుకు 6,460 టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించారు. అంటే దేశంలో సరఫరా పరిస్థితి క్లిష్టంగా మారినప్పుడు, ఇప్పటికే ఉన్న రిఫైనింగ్ మౌలిక సదుపాయాలను గరిష్ఠంగా వినియోగించి ఎల్పీజీ ఉత్పత్తిని పెంచేలా సంస్థలను సిద్ధంగా ఉంచేలా నిర్ణయించింది కేంద్రం.

**స్టోరేజీ నుంచి రవాణా వరకు ఏర్పాట్లు**

కొత్త నిబంధనల ప్రకారం, చమురు సంస్థలు ఎల్?పీజీ నిల్వ, తరలింపు, రవాణాకు అవసరమైన మౌలిక సమదుపాయాలను తగిన స్థాయిలో ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలి. రైల్వేలు, రోడ్డు ట్యాంకర్ల వంటి ఇతర రవాణా వ్యవస్థలను కూడా అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని కేంద్రం సూచించింది. అంతేకాకుండా, సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యమైన మార్గాల ద్వారా ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచాలని ఆదేశించింది.

**నాఫ్తా నుంచి ఎల్పీజీ– టెక్నాలజీ అప్‌గ్రేడ్**

ఎల్?పీజీ ఉత్పత్తిని పెంచేందుకు నాఫ్తాను ఎల్?పీజీగా మార్చే సాంకేతికతను పరిశీలించాలని కేంద్రం సూచించింది. అలాగే గ్యాసోలిన్ ఆధారిత ఫ్లూయిడ్ క్యాటలిటిక్ క్రాకింగ్ యూనిట్లను మరింత సమర్థవంతమైన సాంకేతికతకు అప్?గ్రేడ్ చేయడం వంటి చర్యలను కూడా చేపట్టాలని పేర్కొంది. ఇలాంటి మార్పులు చేపట్టినప్పుడు సంబంధిత సంస్థలు కేంద్ర హైటెక్నాలజీ విభాగానికి లేదా కేంద్రం గుర్తించిన సంస్థకు సమాచారం అందించాల్సి ఉంటుంది.

**అవసరమైతే కేంద్రం నేరుగా ఆదేశాలు**

దేశీయ ఎల్?పీజీ లభ్యత, సమాన పంపిణీ, వినియోగదారులకు సరసమైన ధరల్లో సరఫరా కోసం అవసరమని భావిస్తే, కేంద్ర ప్రభుత్వం రిఫైనరీలు, చమురు మార్కెటింగ్ సంస్థలు, అప్?స్ట్రీమ్ కంపెనీలకు నిర్దిష్ట పరిమాణంలో, పరిమిత కాలానికి ఉత్పత్తి పెంచాలని ఆదేశించవచ్చు. అలాంటి ఆదేశాలు జారీ అయితే నిర్దేశించిన గడువులోపు సంస్థలు ఉత్పత్తిని పెంచాల్సిందే. ఎల్పీజీ ఉత్పత్తి లక్ష్యాలను కేంద్రం శాశ్వతంగా ఒకే విధంగా ఉంచబోవడం లేదు. ప్రతి ఏడాది జనవరి 1, జులై 1 తేదీల్లో ఉత్పత్తి షెడ్యూల్‌ను నవీకరించనుంది. కొత్త రిఫైనరీలు, కొత్త చమురు క్షేత్రాలు అందుబాటులోకి రావడం, సాంకేతిక మార్పులతో అదనపు ఉత్పత్తి సామర్థ్యం ఏర్పడటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని లక్ష్యాలను సవరించనుంది.

**64 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారం**

2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత్? మొత్తం 3.32 కోట్ల టన్నుల ఎల్?పీజీని వినియోగించింది. ఇందులో దేశీయంగా సుమారు 1.31 కోట్ల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయింది. మిగిలిన 2.13కోట్ల టన్నులను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. అంటే దేశ అవసరాల్లో 64 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి. ముఖ్యంగా సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి వచ్చే ఎల్పీజీ దిగుమతులకు సముద్ర మార్గాలపై భారత్ ఎక్కువగా ఆధారపడుతోంది.

**పశ్చిమాసియా సంక్షోభం ఇచ్చిన గుణపాఠం**

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా హర్మూజ్? మార్గంలో రవాణాకు అంతరాయం ఏర్పడటంతో భారత్?కు ఎల్?పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం అత్యవసర చర్యలు చేపట్టింది. రిఫైనరీల్లో పెట్రోకెమికల్స్ తయారీకి ఉపయోగించే కొన్ని ఉత్పత్తి మార్గాలను ఎల్?పీజీ ఉత్పత్తి వైపు మళ్లించాలని మార్చిలో కేంద్రం ఆదేశించింది. అంతేకాకుండా పారిశ్రామిక, వాణిజ్య వినియోదారులకు అమ్మకాలను నిలిపివేసి, ఆ తర్వాత క్రమంగా పెంచింది. గృహ వినియోగదారుల కోసం రీఫిల్ బుకింగ్ వ్యవధిని పెంచింది. సంక్షోభం తీవ్రంగా ఉన్న సమయంలో దేశీయ ఎల్?పీజీ ఉత్పత్తి రోజులు సుమారు 55వేల టన్నులకు పెరిగింది. కానీ ఆ తర్వాత జూన్? మధ్య నుంచి దిగుమతుల సరఫరా క్రమంగా మెరుగుపడటంతో అత్యవసర ఆదేశాలను కేంద్రం ఉపసంహరించుకుంది. అయితే భవిష్యత్తులో ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# మొదలైన శ్రావణమాసం బోనాలు




**టీ మీడియా , ఆగస్టు 16 , ఖమ్మం**
ఖమ్మం ముత్యాలమ్మ గుడి సెంటర్ నందు అంగరంగ వైభవంగా ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రావణమాసం మొదటి ఆదివారం బోనాలు పండుగ ప్రారంభమైంది . ఎన్నో సంవత్సరాల నుంచి శ్రావణమాసం మొట్ట మొదటి బోనాలను రజకులే సమర్పిస్తారని ఈ ఆచారంగా తరతరాల నుండి ఆనవాయితీగా వస్తుందని రజక కులస్తుడు బాతరాజు కనకయ్య పేర్కొన్నారు . ఆడవాళ్లు ఉదయాన్నే లేచి తలంటు స్థానాలు చేసి సాంప్రదాయంగా మట్టి కుండలో అమ్మవారికి నైవేద్యం వండుకుని బోనాలు ఎత్తుకొని గుడి దగ్గరికి వచ్చి అమ్మవారికి సమర్పిస్తారని అన్నారు . ఈ కార్యక్రమంలో బాతరాజు భవాని , ప్రసాద్ , పిల్లుట్ల కృష్ణ , మామిడాల తిరుమలరావు , నాగరాజు , వెలిశాల శ్రీను , పెల్లిట్ల శ్రీను , కొండలు , బాతరాజు సరిత , భోగి శాంతి , పుష్ప , అశ్విని , గంగమ్మ , స్పందన తదితరులు పాల్గొన్నారు .

# ఎమ్మార్పీపై అధిక ధరకు విక్రయాలు

## ● చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ

**టీ మీడియా , ఆగస్టు 16 , అమరావతి బ్యూరో :**
రాష్ట్రంలో మద్యం దుకాణాల లీజు గడువు మరో రెండు నెలల్లో ముగియనుంది. దీంతో ఎమ్మార్పీ కంటే అధిక ధర వసూళ్లకు యజమానులు తెరలేపారు. చివరలో అందిన కాడికి దండుకుందామన్నట్లు కూడబలుక్కుని ఒక్కో సీసాపై రూ.10 అదనంగా తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల రూ.20 చొప్పున ఎక్కువ వసూలు చేస్తున్నారు. సెప్టెంబర్ చివరి నాటికి షాప్?ల లీజు గడువు ముగియనుండగా, అక్టోబర్? నుంచి కొత్తగా దుకాణాలు కేటాయించాల్సి ఉంది.ఈ క్రమంలో ఆగస్టు ఆరంభం నుంచి అధికంగా వసూలు చేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో రూ.5 నుంచి రూ.10 వరకు, ఉమ్మడి కృష్ణా జిల్లాలో రూ.10 నుంచి రూ.15 వరకు అదనంగా తీసుకుంటున్నారు. ప్రకాశం జిల్లాలో రూ.10, మార్కాపురం జిల్లాలో కొన్నిచోట్ల రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా చాలాచోట్ల బెల్ట్ షాప్స్ నడుస్తున్నాయి. ఇక్కడ క్వార్టర్ బాటిల్‌కు రూ.30–50 అదనంగా వసూలు చేస్తున్నారు.సాధారణ మద్యం దుకాణాల్లో కొన్ని బ్రాండ్లు అమ్మడం లేదు. వాటిని బెల్ట్ దుకాణాలకు తరలించి అధిక ధరలకు అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 193 పైగా వైన్ షాప్స్? నడుస్తున్నాయి. మెజార్టీ దుకాణాలు రాజకీయ పార్టీల నాయకులు లేకుంటే నేత అనుచరులే నడిపిస్తున్నారు. ప్రాంతంతో సంబంధం లేకుండా అన్నిచోట్లా సిండికేట్‌గా ఏర్పడి ఇష్టానుసారం అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో బెల్ట్ దుకాణాల్లో రూ.40 వరకు ఎక్కువగా దండుకుంటున్నారు.రాయలసీమ జిల్లాల్లోని మెజార్టీ మద్యం దుకాణాల్లో రూ.10 చొప్పున, కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం రూ.20 చొప్పున అధికంగా వసూలు చేస్తున్నారు. వాస్తవానికి వైన్ షాప్?ల మధ్య పోటీ ఉండటంతో మొన్నటి వరకు ఎమ్మార్పీకే అమ్ముతామని బోర్డులు పెట్టేవారు. ఇప్పుడు ఆ బోర్డులు కనిపించడం లేదు. ఎమ్మార్పీకి మించి అమ్మితే చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రస్తుతం దుకాణాల లీజు గడువు పూర్తవుతుండడంతో పర్మిట్ రూమ్‌లకు సంబంధించి, క్వార్టర్లీ చెల్లించాల్సిన ఫీజు బకాయిల వసూళ్లపై ఫోకస్ పెట్టారు.

# మృతి చెందిన డబుల్ బెడ్రూం వాసి

**టీ మీడియా, ఆగస్టు 16 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని డబుల్ బెడ్రూం వాసి ఈ నెల 9 న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆవుల బాలకృష్ణ కొన్ని రోజులుగా నిమ్స హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆదివారం సాయంకాలం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు బాలకృష్ణ మృతితో పెబ్బేరులో డబుల్ బెడ్రూం కాలనీ లో విషాద ఛాయలు ఆలుము కున్నాయి.



# అమెరికాలో కాల్పుల కలకలం

## ⏭ నిందితుడితో సహా ఆరుగురు మృతి



**టీ మీడియా , ఆగష్టు 16 , ఢిల్లీ బ్యూరో :** అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు కలకలం రేపాయి. మిషిగన్ రాష్ట్రంలోని మిస్సాకీ కౌంటీలో శుక్రవారం జరిగిన కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో 16 ఏళ్ల బాలుడు సహా నలుగురు పెద్దలు ఉన్నారు. మరో 13 ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత ఓ నివాసంలోకి ప్రవేశించిన దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు మృతి చెందారు. అనంతరం అక్కడి నుంచి పరారై మరో ఇంటికి వెళ్లి కాల్పులు జరపడంతో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత సమీప అటవీ ప్రాంతంలో మరో మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్న 39 ఏళ్ల చాడ్ హిక్‌మన్ మృతదేహం కూడా అదే అటవీ ప్రాంతంలో లభ్యమైంది. దీంతో ఈ ఘటనలో నిందితుడి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోంది.

**ఇంట్లోకి చొరబడి కాల్పులు**

డెట్రాయిట్‌కు సుమారు 170 మైళ్ల (270 కిలోమీటర్ల) దూరంలోని ఓ ఇంట్లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందడంతో శుక్రవారం ఉదయం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో తనిఖీలు చేపట్టిన అధికారులు 16 ఏళ్ల బాలుడు, 45 ఏళ్ల వ్యక్తి, 40 ఏళ్ల మహిళ మృతదేహాలను గుర్తించారు. అదే ఇంట్లో 13 ఏళ్ల బాలిక కూడా తుపాకీ గాయాలతో కనిపించింది. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. కాల్పుల అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడి కోసం మిస్సాకీ కౌంటీలో భారీగా గాలింపు చేపట్టారు.

**మరో ఇంట్లోనూ కాల్పులు**

నిందితుడి కోసం గాలింపు కొనసాగుతున్న సమయంలో మరో ఇంట్లో 53 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడు కూడా తుపాకీ గాయాలతో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. దాంతో నిందితుడే ఈ హత్య కూడా చేసి, పరారయ్యాడని భావించిన పోలీసులు, అతడి కోసం విస్తృతంగా గాలించారు. అదే సమయంలో సమీపంలోని అటవీ ప్రాంతంలో 29 ఏళ్ల మహిళ మృతదేహం లభించింది. ఆమె మృతదేహం పక్కనే అనుమానితుడు చాడ్ హిక్‌మన్ మృతదేహం కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పుల్లో మృతి చెందిన వారందరూ తుపాకీ గాయాల కారణంగానే ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. హిక్‌మన్ ఎలా మృతి చెందాడు? కాల్పులకు కారణమేంటి? అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు ఒకరికొకరు లేదా నిందితుడికి బంధువులా అనే విషయాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు.

**బాలికను వేధించిన కేసులో జైలుకి!**

కోర్టు రికార్డుల ప్రకారం, చాడ్ హిక్‌మన్‌పై గతంలోనూ కేసు నమోదైంది. ఓ బాలికను వేధించిన కేసులో 2024లో అతడికి ఏడాది జైలు శిక్ష పడినట్లు పోలీసులు తెలిపారు. తాజా కాల్పుల ఘటనకు ఆ కేసుకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోందా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయలేదు. “ఈ పరిస్థితి సమాజానికి హృదయ విదారకంగా ఉంది. ఇందులో పాల్గొన్న దర్యాప్తు అధికారులకు కూడా ఇది సవాలుతో కూడుకున్న పరిస్థితి” అని మిచిగాన్ స్టేట్ పోలీస్ లెఫ్టినెంట్ యాష్లే మిల్లర్ తెలిపారు. శనివారం కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

**గవర్నర్ విట్మర్ స్పందన**

మిషిగన్ గవర్నర్ గ్రెచెన్ విట్మర్ ఈ ఘటనపై స్పందించారు. ఈ పరిస్థితిని తాను పర్యవేక్షిస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. బాధితులు, వారి కుటుంబాలు, మిస్సాకీ సమాజం గురించి తన ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

**మరో కాల్పుల ఘటన**

మరోవైపు వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ విద్యార్థి సహా ఐదుగురు గాయపడ్డారు. ఈ కేసులో 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. రెండు ఘటనలు వేర్వేరుగా చోటుచేసుకున్నప్పటికీ వరుస కాల్పులతో అమెరికాలో మరోసారి భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# నకిలీ చీరలకు చెక్




## ⏭ యాప్‌లో ఒక్క స్కాన్‌తో అసలు మ్యాటర్ రివీల్?!

**టీ మీడియా , ఆగష్టు 16 , ఢిల్లీ బ్యూరో :** బనారసీ చీర పేరు వినగానే నాణ్యత, నైపుణ్యం, ప్రత్యేకత గుర్తుకొస్తాయి. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పర్యాటకులు కాశీకి వచ్చి ఈ చీరలను ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇదే ఆదరణను కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. బనారసీ చీరల పేరుతో ఇతర ప్రాంతాల్లో తయారైన చీరలను విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా సూరత్‌లో తయారైన చీరలను బనారసీ చీరలుగా చెబుతూ భారీ ధరలకు విక్రయిస్తున్నారని స్థానిక నేత కార్మికులు చెబుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు వారణాసిలోని నేత కార్మికుల సంఘం ఓ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై బనారసీ చీర కొనేముందు దానిపై ఉన్న బార్‌కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు. ఆ చీర అసలైనదో, నకిలీదో తెలుసుకోవచ్చు.

**‘బనారస్ మే బునా’ యాప్**

వారణాసి వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ‘బనారస్ మే బునా’ పేరుతో ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. బనారస్‌లో నేసిన అసలైన చీరలకు ప్రత్యేకమైన బార్‌కోడ్ లేదా క్యూఆర్ కోడ్ ట్యాగ్‌ను జతచేస్తున్నారు. వినియోగదారులు చీర కొనుగోలు చేసే సమయంలో తమ మొబైల్ ఫోన్‌తో ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే, చీరకు సంబంధించిన పూర్తి సమాచారం తెరపై కనిపిస్తుంది. చీర ఎప్పుడు తయారైంది? ఎవరు తయారు చేశారు? ఎలాంటి దారం లేదా వస్త్రాన్ని ఉపయోగించారు? తయారీదారు పేరు, చిరునామా, మొబైల్ నంబర్ వంటి వివరాలు తెలుసుకోవచ్చు. అంతేకాదు ఆ చీర బనారస్‌లో తయారైందా? లేక ఇతర ప్రాంతంలో తయారైనదా? అనే విషయాన్ని కూడా గుర్తించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది.

**నకిలీ చీరలకు అడ్డుకట్ట**

ప్రస్తుతం బనారసీ చీరల పేరుతో సూరత్ తదితర ప్రాంతాల్లో తయారైన చీరలను విక్రయిస్తున్నారని నేత కార్మికులు చెప్పిన విషయాల ప్రకారం, తక్కువ ధరకు తయారయ్యే చీరలను కొందరు బనారసీ చీరలుగా చెప్పి రూ.8 వేలు, రూ.10 వేల వరకు విక్రయిస్తున్న ఘటనలు ఉన్నాయి. ఉదాహరణకు రూ.300 విలువైన చీరను బనారసీ చీరగా చెప్పి వేల రూపాయలకు విక్రయించడం వల్ల పర్యాటకులు మోసపోతున్నారు. ఈ వ్యవహారం వల్ల అసలైన బనారసీ నేత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. వినియోగదారులు అధిక ధర చెల్లించినప్పటికీ ఆ మొత్తంలో అసలైన నేత కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ఫలితంగా తరతరాలుగా చేనేత వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**ఒక్క స్కాన్‌తో పూర్తి సమాచారం**

ఈ యాప్‌ను ఉపయోగించడం కూడా చాలా సులభమని అధికారులు చెబుతున్నారు. వినియోగదారుడు బనారసీ చీర కొనుగోలు చేసేటప్పుడు దానికి జతచేసిన బార్‌కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేయాలి. వెంటనే ఆ చీరకు సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. చీరకు జత చేసిన ట్యాగ్‌ను తొలగించి మరో నకిలీ చీరకు అమర్చినా ఈ విధానం ద్వారా మోసాన్ని గుర్తించే అవకాశం ఉంది. ఎందుకంటే కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ ట్యాగ్ ఏ చీర కోసం జారీ చేశారో దాని వివరాలే కనిపిస్తాయి. ట్యాగ్‌కు సంబంధించిన అసలు చీరతో సరిపోలని ఉత్పత్తిపై దాన్ని అతికిస్తే వినియోగదారుడు విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు.

**20–30 శాతం దుకాణాలకు చేరిన విధానం**

నాలుగు తరాలుగా బనారసీ చీరల వ్యాపారంలో ఉన్న స్థానిక వ్యాపారులు, గత ఐదేళ్లుగా సూరత్‌లో తయారైన చీరలను బనారసీ చీరలుగా విక్రయించే విధానం పెరిగిందని శైలేశ్ చెప్పారు. దీంతో ఈ మోసాలను అరికట్టేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చామని అన్నారు. ప్రస్తుతం ఈ విధానం సుమారు 20 నుంచి 30 శాతం దుకాణాలకు చేరినట్లు సమాచారం. మరింత మంది నేత కార్మికులు, వ్యాపారులకు ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే వెయ్యి మందికి పైగా వినియోగదారులు ఈ ట్యాగింగ్ విధానాన్ని ఉపయోగించి చీరలు కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రానున్న నెలలో బనారస్‌లోని మరింత మంది నేత కార్మికులకు ఈ యాప్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**వినియోగదారుల్లోనూ సంతోషం**

ఈ కొత్త విధానం పట్ల వినియోగదారులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా చీర వివరాలను తెలుసుకుని కొనుగోలు చేసిన తృప్తి అనే వినియోగదారురాలు ఇది కొనుగోలుదారులకు మరింత పారదర్శకతను అందిస్తుందని చెప్పారు. ‘అసలైన బనారసీ చీరకు, నకిలీ చీరకు మధ్య తేడాను సాధారణంగా గుర్తించడం కష్టం. అందుకే చాలాసార్లు నకిలీ చీరను అసలైనదిగా భావించి భారీ ధర చెల్లిస్తుంటాం. క్యూఆర్ కోడ్ ద్వారా చీర తయారీకి ఉపయోగించిన వస్త్రం, తయారీ వివరాలు, ధర వంటి సమాచారం తెలుసుకునే అవకాశం ఉండటం చాలా ఉపయోగకరం’ అని ఆమె పేర్కొన్నారు.

# గోదావరికి ఆగస్టు గండం

## ⏭ నాటి వరదకు 40 ఏళ్లు



**టీ మీడియా , ఆగష్టు 16 , అమరావతి బ్యూరో :** గోదావరి మహోగ్ర రూపం, ఏటిగట్లకు గండ్లు, జలసమాధైన ఊళ్లు, ఆస్తి, ప్రాణ నష్టం ఇదంతా వినగానే గోదావరి తీర ప్రాంత ప్రజలకు ముందుగా గుర్తుకొచ్చేది ‘ఆగస్టు’ నెల. అవును, గోదావరి వరదలకు ఈ నెలకు ఒక అవినాభావ సంబంధం ఉంది. గత ఘటనలను 1953 నుంచి నేటి వరకు గోదావరికి పోటెత్తిన అతిపెద్ద జల ప్రళయాలన్నీ ఆగస్టులోనే సంభవించాయి.

ఉగ్ర గోదావరి ధాటికి ఏటిగట్లు తెగిపోయి, ఊళ్లు మునిగిపోయి లక్షలాది మంది రోడ్డున పడిన విషాద ఘటనలు ఎన్నో ఈ నెలలోనే జరిగాయి. ముఖ్యంగా 1986 ఆగస్టు 16న వచ్చిన భీకర వరదను గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేరు. చరిత్రలోనే అత్యధిక వరదలు నమోదు చేసిన ఆ మహా విపత్తు సంభవించి నేటికి సరిగ్గా 40 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో గోదావరి వరదల చరిత్రపై ప్రత్యేక కథనం.

**ఇవీ ఘటనలు**

1953 ఆగస్టు 16న ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తూ 30,03,100 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదిలారు. అప్పట్లో పలుచోట్ల ఏటిగట్లు తెగిపోయి నీరంతా గ్రామాలను ముంచెత్తింది.అత్యంత భీకరంగా 1986 ఆగస్టు 16న వచ్చిన వరదకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 3వ ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తూ సముద్రంలోకి 35,06,380 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. గోదావరి వరదల చరిత్రలో ఇదే పెద్ద రికార్డు. అప్పట్లో పి.గన్నవరం మండలం నాగుల్లంక వద్ద వశిష్ఠ ఎడమ ఏటిగట్టు ఏకంగా ఏడు చోట్ల తెగిపోయి ఆ గ్రామం దెబ్బతింది. ఈ వరదకు నేటికి 40 సంవత్సరాలు.2006 ఆగస్టు 6న వచ్చిన ఉద్ధృత వరదకు సముద్రంలోకి 28,50,664 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. ఆ రోజు సాయంత్రం అయినవిల్లి మండలం శానపల్లిలంక వద్ద గౌతమి ఎడమ ఏటిగట్టు, పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద వశిష్ఠ ఎడమ ఏటిగట్టుకు గండ్లు పడ్డాయి. కోనసీమలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి.

ఎల్‌నినో ప్రభావంతో ఈ నెల మొదటి వారంలో వరద 2వ ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుని తగ్గిపోయింది. ప్రధానంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని వరదల సీజన్‌లో గోదావరి ఉరవడి లేక జోరుతగ్గి ప్రవహిస్తోంది.

# ఇంజినీరింగ్ ‘కన్వీనర్ కోటా’లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

## ⏭ ఈసారి 72,000 మంది మాత్రమే చేరిక



**టీ మీడియా , ఆగష్టు 16 , హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో ‘కన్వీనర్ కోటా’లో చేరే విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది స్వల్పంగా తగ్గింది. గత ఏడాది సుమారు 75,000 మంది విద్యార్థులు చేరగా, ఈ ఏడాది ఆ సంఖ్య 72,000కు పడిపోయింది. ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల ప్రభావం వల్లే ఈ పరిస్థితి నెలకొందని అధికారులు భావిస్తున్నారు. కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్న 94,000 సీట్లకు గాను, చివరి విడత కౌన్సెలింగ్‌లో 75,054 మంది విద్యార్థులు సీట్లు పొందినప్పటికీ, వాస్తవానికి 72,000 మంది మాత్రమే కళాశాలల్లో చేరారు. ‘స్లైడింగ్’ ప్రక్రియ ద్వారా బ్రాంచ్‌లు మార్చుకునే అవకాశం కల్పించగా, దీనికి 6,751 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,856 మంది విజయవంతంగా తమ బ్రాంచ్‌లను మార్చుకున్నారని అడ్మిషన్స్ కన్వీనర్ శ్రీదేవసేన శనివారం తెలిపారు.

**స్పాట్ అడ్మిషన్ల కోసం ఎప్‌సెట్**

విద్యార్థులు ఈ నెల 17వ తేదీలోపు తమ అలాట్‌మెంట్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకుని, కొత్త బ్రాంచ్‌లలో చేరేందుకు సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఆమె సూచించారు. కాగా శనివారంతో స్లైడింగ్ ప్రక్రియ ముగియడంతో ‘స్పాట్ అడ్మిషన్ల’ కోసం మిగిలి ఉన్న సీట్ల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ నెల 19, 20 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని, పూర్తి వివరాలను ఎప్?సెట్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలు వర్తించవని ఆమె స్పష్టం చేశారు.

**ప్రముఖ కళాశాలల్లోనూ ఖాళీ సీట్లు**

సీబీఐటీ, సీవీఆర్, నారాయణమ్మ, భోజరెడ్డి వంటి ప్రముఖ కళాశాలల్లోని ప్రధాన బ్రాంచ్‌లలో సీట్లు ఇంకా భర్తీ కాలేదు.కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో సీఎస్‌ఈ, ఈసీఈ, ఐటీ, ఈఈఈలోనూ బ్రాంచ్‌లలో పెద్ద సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయి. జేఎన్‌టీయూహెచ్ మహబూబాబాద్‌లో గణనీయమైన సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయి. మెకానికల్ విభాగంలో 66 సీట్లకు గాను 60, ఈసీఈలో 50, ఈఈఈలో 49, సీఎస్?ఈలో 34, డేటా సైన్స్‌లో 47 సీట్లు ఖాళీగా ఉన్నాయి. హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో ‘బిల్డింగ్ సర్వీసెస్ ఇంజినీరింగ్’లో 52 సీట్లు బీ ప్లానింగ్?లో 22 సీట్లు ఇంకా భర్తీ కాలేదు. జేఎన్?టీయూ పాలేరు కళాశాలలో పలు విభాగాల్లో సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోవడం గమనార్హం.డేటా సైన్స్‌లో 66 సీట్లకుగాను 45, సీఎస్ఈలో 44, ఈసీఈలో 49, ఈఈఈలో 59, మెకానికల్ విభాగంలో 60 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వనపర్తి, సిరిసిల్లలోని జేఎన్?టీయూ కళాశాలల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.కోస్గిలోని ప్రభుత్వ కళాశాలలో భర్తీ అయిన సీట్ల సంఖ్య కంటే ఖాళీగా ఉన్న సీట్ల సంఖ్యే ఎక్కువగా ఉంది.

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని హుస్నాబాద్‌లో స్పాట్ అడ్మిషన్లకు అందుబాటులో ఉన్న సీట్లలో ఐటీలో 60, సీఎస్?ఈ ఏఐలో 30, సీఎస్?ఈలో 19, ఈసీఈలో 34 సీట్లు ఉన్నాయి.తగిన మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు లేరనే భావనతో ప్రభుత్వ కళాశాలల్లో చేరడానికి విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు.

# కల్తీకి చెక్ పెట్టేలా కొత్తగా టీజీ సేఫ్

## ⏭ ఫుడ్‌సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ శాఖల విలీనం

**టీ మీడియా , ఆగష్టు 16 , హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఆహార కల్తీ, డ్రగ్స్ వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన మేరకు తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ – టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేసింది.

**టీజీ–సేఫ్ కమిషనర్‌గా అవినాష్ మొహంతి**

ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌ను విలీనం చేసి టీజీ–సేఫ్‌ను ఏర్పాటుచేసిన ప్రభుత్వం, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డైరెక్టర్ జనరల్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అవినాష్ మొహంతిని టీజీ–సేఫ్ కమిషనర్‌గా నియమించింది. ఫుడ్ సేఫ్టీ స్టాండ్ యాక్ట్–2026 ప్రకారం టీజీ–సేఫ్ కమిషనర్ అధికారాలు, విధులు నిర్వహించనున్నారు. ఫుడ్ సేఫ్టీ ఉల్లంఘనలపై మరింత సమన్వయంతో చర్యలు తీసుకునే దిశలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

**ఆహార కల్తీలకు అడ్డుకట్ట**

తెలంగాణ రాష్ట్రంలో నకిలీ, నాణ్యత లేని మందుల అక్రమ రవాణా, విక్రయాలు, హోటళ్ళు ,, దుకాణాల్లో జరిగే ఆహార కల్తీలకు టీజీ సేఫ్ అడ్డుకుంటోంది. టీజీ సేఫ్ పరిధిలో డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయి.

**హెచ్ ఫాస్ట్‌తో పాటు టీజీ సేఫ్!**

అధికార యంత్రాంగం ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా ఆహార కల్తీ ఆగడం లేదు. ఇంట్లో వండే ఆహార పదార్థాలే కాదు హోటళ్లలో కూడా కల్తీ బయటపడుతోంది. ఇటీవల కొన్ని హోటళ్లలో నాలుగైదు రోజులుగా నిల్వ చేసిన మటన్, చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటికీ ప్రజల నిర్లక్ష్యం కూడా కొంత కారణం అవుతోంది. ఇటీవల హైదరాబాద్ కాటేదాన్ కేంద్రంగా సాగుతున్న మసాలాల కల్తీ రాకెట్‌ను హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం బయటపెట్టింది. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేసి, ఏకంగా 25,300 కిలోల కల్తీ మసాలా దినుసులను స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ నగరంలో పుట్టగొడుగుల్లా కల్తీ ఆహారం పదార్థాల తయారీ కేంద్రాలు వెలిశాయని వీటిపై ఉక్కుపాదం మోపేందుకే సీపీ సజ్జనార్ సూచనతో ‘హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్’ ఏర్పాటు చేశారు. దానితో పాటు టీజీ సేఫ్‌ను సైతం ఏర్పాటు చేశారు.

ఆహార భద్రతా ప్రమాణాల చట్టం–2006 స్వాతంత్ర్యం తర్వాత దేశవ్యాప్తంగా ఏకీకృత ఆహార ప్రమాణాలను నిర్దేశించేందుకు ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం–1954 స్థానంలో ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం–2006 ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి సంస్థల ఏర్పాటుకు తోడ్పాటును అందించింది.

# తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



**టీ మీడియా, ఆగస్టు 16 ముదిగొండ :**
ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణ రక్షణ కోసం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సామినేని వెంకయ్య, కుసుమాంబ, లక్ష్మమ్మల జ్ఞాపకార్థంగా రుధిరం చారిటీ మరియు సంకల్ప ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో దాతలు తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపూడి బుచ్చి రామయ్య ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. "తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారులకు నిరంతరం రక్తం ఎంతో అవసరం. రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంచేయడానికిముందుకురావాలని"పిలుపు నిచ్చారు.రక్తదానం చేసిన దాతల మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రుధిరం ఫౌండేషన్ సామినేని రాకేష్, కోఆర్డినేటర్ బిచ్చాల కవిత, మహమ్మద్ అబ్దుల్ నబీ టీమ్, గ్రామ ప్రముఖులు, యువకులు మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొని కార్యక్రమ విజయవంతానికి కృషి చేశారు.

# అర్ధరాత్రి ఘోర రోడ్డుప్రమాదం




**టీ మీడియా , ఆగస్టు 16 ,సూర్యాపేట**
విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సు ఆదివారం తెల్లవారుజామున తెలంగాణలోని సూర్యాపేటవద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఆకుపాముల ప్రాంతంలో శ్రీకృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కు చెందిన సూపర్ లగ్జరీ బస్సును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో రెండు వాహనాల్లో కలిపి మొత్తం 58 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రైవేట్ బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుపోయారు. రెండు గంటల పాటు సాగిన ఆపరేషన్ తర్వాత, ప్రయాణికులందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ఘటనపై బాధితులు మీడియాతో మాట్లాడుతూ... ఈ ప్రమాదం తెల్లవారుజామున 2:30 నుండి 3 గంటల మధ్య జరిగిందని తెలిపారు. డ్రైవర్ అజ్మత్ ఫోన్ కాల్‌కు సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించి వాహనంపై నియంత్రణ కోల్పోయాడని, అతనికి తల భాగంలో గాయాలయ్యాయి కానీ, ప్రస్తుతం అతను ప్రమాదం నుండి బయటపడ్డాడని సూచించారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలలో ఆ ప్రైవేట్ బస్సు నుజ్జునుజ్జుగా మారిన స్థితిలో కనిపించింది. ఈ ఘటనపై కేసుమ నమోదు చేసుకున్న పోలీసులు స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులు ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు.

# కల్తీ పెరుగు, కోవా తయారీ



**⏭ కేంద్రంపై ఎస్ఓటీ దాడి..**

**టీ మీడియా , ఆగస్టు 16 , జవహర్ నగర్:**
కాప్రా సర్కిల్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో ఓ మిల్క్ సెంటర్‌లో కల్తీ పెరుగు, కోవా తయారు చేస్తున్న కేంద్రంపై మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా 120 కిలోల కల్తీ పెరుగు, 6 కిలోల కోవాను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి తయారీ, గడువు తేదీలు, లేబుళ్లు లేకుండా పెరుగు, కోవా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు ఎస్ఓటీ ఎస్ఐ. సాయికుమార్ తెలిపారు. తనిఖీల్లో సుమారు వెయ్యి కిలోల పెరుగు, 50 కిలోల కోవా నిల్వ ఉన్నట్లు గుర్తించామన్నారు.పెరుగు, కోవా నమూనాలను ఆహార భద్రతాధికారులకు పంపించామని, పరీక్షల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో కల్తీ పెరుగు కల్తీ పదార్థాలు పట్టుకున్నారని వైరల్ కావడంతో మళ్లీ రంగంలోకి దిగిన ఎస్ఓటి పోలీసులు దాడి చేసి 120 కిలోల కల్తీ పెరుగు. 50 కిలోల కల్తీ కోవాను పట్టుకొని జవహర్ నగర్ ఎస్ఓటి పోలీసులకు అప్పగించారు.అక్రమంగా దొంగ చాటున నడుపుతున్న మిల్క్ సెంటర్ ను ఎస్ఓటి పోలీసులు సీజ్ చేసి మిల్క్ సెంటర్ యజమానిని జవహర్ నగర్ ఎస్ ఓ టి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ మిల్క్ సెంటర్ లో గత కొంతకాలంగా కల్తీ పదార్థాలను తరలిస్తూ ప్రముఖ బ్రాండ్ల పేరుమీద చలామణి చేస్తూ కల్తీ వస్తువులకు ఆద్యం పోస్తున్నాడు. మిల్క్ షాప్ యజమాని కల్తీ వస్తువులు అమ్ముతూ ప్రజల ప్రాణాల పాలిట యమ శాపాలుగా మారారని, ఇకపై కల్తీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

# కాలువలోకి దూసుకెళ్లిన కారు

**⏭ నలుగురు యువకులు గల్లంతు**



**టీ మీడియా , ఆగష్టు 16 , పశ్చిమగోదావరి :**
పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఒక ఘోర ప్రమాదం జరిగింది. ఇరగవరం మండలం ఐతంపూడి లాకుల మలుపు వద్ద వేగంగా వస్తున్న ఒక కారు నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా ఒకరు ప్రాణాలతో బయటపడగా, నలుగురు యువకులు నీటి ప్రవాహంలో గల్లంతయ్యారు. అందులో ఇద్దరి మృతదేహాలను అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు.

**అదుపుతప్పిన కారు**

ఇరగవరం మండలం ఐతంపూడి వద్ద కారు అదుపుతప్పి కాలువలోనికి దూసుకుపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. మరొకరు స్థానికుల సహాయంతో సురక్షితంగా బయటపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా మోరి, పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులు స్నేహితుని పెళ్లి కోసం పెరవలి వచ్చారు. తిరిగి ప్రయాణంలో ఓగిడి గ్రామంలో స్నేహితుని కలవడానికి బయల్దేరారు. ఈ క్రమంలో వర్షం కురుస్తుండటంతో దారి కనిపించక, కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. నలుగురు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు.ఓ యువకుడు చెట్టుకొమ్మను పట్టుకొని స్థానికుల సహకారంతో బయటపడ్డాడు. అక్కడే ఉన్న స్థానికులు ట్రాక్టర్ సహకారంతో కారును బయటికి తీశారు. ప్రమాదం నుంచి బయటపడిన సంతోష్ నలుగురికి కాల్ చేసినప్పటికీ ఫోన్లు పనిచేయలేదు. గల్లంతయిన వారిలో పోతుల లక్ష్మీభాను, నాగిరెడ్డి దుస్వంత మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగిలిన ఇద్దరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రాణాలు కాపాడుకునే క్రమంలో గల్లంతు ఈ ఘటనలో ప్రాణాలను కాపాడుకునే క్రమంలో కారులోంచి బయటికి వచ్చిన నలుగురు ప్రవాహ వేగానికి కొట్టుకొని పోయారు. ఒకరు మాత్రం ప్రవాహంలో దొరికిన చెట్టుకొమ్మను పట్టుకొని స్థానికుల సహకారంతో బయటపడ్డారు. మట్టా సంతోష్ ప్రమాదం నుంచి బయటపడగా పోతుల లక్ష్మీభాను(18), రాజారాం (17), నాగిరెడ్డి దుస్వంత(18) నాగ బత్తుల సాయి సూర్య (19) గల్లంతయ్యారు. ట్రాక్టర్ సహకారంతో కారును బయటికి తీశారు. ప్రమాదం నుంచి బయటపడిన సంతోష్ సహకారంతో నలుగురికి ఫోన్లు చేసినప్పటికీ ఫోన్లు పనిచేయకపోవడంతో గల్లంతయ్యారని పోలీసులు భావించారు.

# ముత్యాలమ్మ బోనాల వేడుకలు



**టీ మీడియా ,ఆగష్టు 16, ఆళ్లపల్లి :**
ఆళ్లపల్లి మండల పరిధిలోని మార్కోడు గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి బోనాల పండుగ అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ముగిసింది. స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలందరూ విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో కోలాహలంగా మారింది. సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు తలపై పసుపు, కుంకుమలు, వేప మండలతో అలంకరించిన బోనాల గటాలను ధరించి నగర సంకీర్తనలతో, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద బారులు తీరి అమ్మవారికి నైవేద్యాలు, బోనాలు సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు, దివ్య హారతి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. డప్పు వాయిద్యాల మోతలు, శివసత్తుల పూనకాలతో ఆలయ పరిసరాలన్నీ ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి.ఈ వేడుకల్లో గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# చోరీపై మూడు నెలలుగా మౌనం

**⏭ రికార్డులు మాయం, ఫైల్స్ డిలీట్ ?**

**⏭ సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై అనుమానాలు**




**టీ మీడియా, ఆగస్టు 16, దమ్మపేట:**
దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన చోరీ ఘటనకు మూడు నెలలకు పైగా గడిచినా అనేక ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు దొరకడం లేదు. మే 7, 2026న వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సాధారణ చోరీగా కాకుండా పంచాయతీకి సంబంధించిన కీలక రికార్డుల భద్రత, పారదర్శకత, జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.పంచాయతీ కార్యాలయంలోని బీరువాలు పగలగొట్టి వస్తువులు ఎత్తుకెళ్లడంతో పాటు కీలక రికార్డులు మాయం కావడం, కంప్యూటర్‌లోని కొన్ని ఫైల్స్ డిలీట్ చేశారనే సమాచారం మరింత ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వార్డు సభ్యులు గతంలో జరిగిన పనులకు సంబంధించిన రికార్డులు, వివరాలు కోరిన సమయంలోనే ఈ ఘటన వెలుగులోకి రావడం అనుమానాలకు తావిస్తోంది.రికార్డులు చూపించాల్సిన సమావేశానికి ముందు రోజు కార్యాలయంలోని బీరువాలు పగలగొట్టబడటం యాదృచ్ఛికమా? లేక ముందస్తు సమాచారం ఉన్నవారి పనేనా? అన్న సందేహాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ప్రశ్నలకు తుది సమాధానం దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.చోరీ జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపినట్లు అప్పటి వార్తల్లో పేర్కొన్నారు. అయితే ఇంతకాలం గడిచినా కేసు దర్యాప్తు ఏ దశలో ఉందన్న విషయంపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయలేదు?**

ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు సంబంధించిన కీలక రికార్డులు భద్రంగా ఉండాల్సిన సమయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం మరో కీలక ప్రశ్నగా మారింది. కెమెరాలు ఎందుకు పనిచేయలేదు? వాటి నిర్వహణ బాధ్యత ఎవరిది? ఘటనకు ముందు నుంచే అవి పనిచేయలేదా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**మాయం అయిన రికార్డులు**

చోరీకి గురైన రికార్డులు ఏమిటి? వాటిలో ఏఏ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు ఉన్నాయి? వాటి విలువ ఎంత? అనే అంశాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. రికార్డులు నిజంగా మాయం అయితే వాటిని తిరిగి పొందేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారన్నది కూడా తెలియాల్సి ఉంది.అదేవిధంగా కంప్యూటర్‌లో డిలీట్ అయినట్లు చెబుతున్న ఫైల్స్‌ను సాంకేతికంగా పరిశీలించారా? డేటాను రికవరీ చేసేందుకు ప్రయత్నించారా? కార్యాలయంలోకి ఘటనకు ముందు, తర్వాత ఎవరెవరు వచ్చారు? వారి కదలికలను దర్యాప్తు అధికారులు పరిశీలించారా? అన్నది కూడా కీలకమే.

**దోషులెవరో కాదు**

ఈ ఘటనలో ఎవరినీ ముందుగానే దోషులుగా నిర్ధారించడం కాదు. అసలు నిజం ఏమిటో వెలికి తీయడమే ప్రజల ప్రధాన డిమాండ్. దర్యాప్తు సంస్థలు తమ పని తాము చేయాల్సిందే. అయితే దర్యాప్తు ఏ దశలో ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.దమ్మపేట పంచాయతీ కార్యాలయం సాధారణ కార్యాలయం కాదు. వేలాది మంది ప్రజలకు సంబంధించిన పరిపాలనా వ్యవస్థకు అది కీలక కేంద్రం. అక్కడి రికార్డుల భద్రతపై సందేహాలు తలెత్తినప్పుడు వాటిని చిన్న సమస్యగా పక్కన పెట్టడం సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మూడు నెలలకు పైగా సమయం గడిచిన నేపథ్యంలో కేసు దర్యాప్తు పురోగతి ఏమిటి? మాయం అయిన రికార్డులు ఏవి? కంప్యూటర్ డేటాపై సాంకేతిక పరిశీలన జరిగిందా? సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయలేదు? బాధ్యులను గుర్తించారా? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే పారదర్శకమైన దర్యాప్తు, బాధ్యుల గుర్తింపు, వాస్తవాల వెల్లడే మార్గం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కార్యాలయంలో సీసీ కెమెరాల నిర్వహణ, రికార్డుల భద్రత, డిజిటల్ డేటా బ్యాకప్ వంటి చర్యలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది

# అక్రమాల చక్రబంధంలో కేఎంసీ!

- కార్యాలయం ఎదుటే కాలువ కబ్జా
- గోళ్లపాడు చానల్ గోవిందా!
- అనుమతులు లేని ఫంక్షన్ హాళ్లు..
- బడాబాబులకు భారీ ఆస్తి పన్ను రాయితీలపై ఆరోపణలు

**టీ మీడియా, ఆగస్టు 16, ఖమ్మం బ్యూరో:**
ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మహానగరాల సరసన నిలబెట్టేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న ప్రయత్నాలకు నగర పాలక సంస్థ (కేఎంసీ)లోని కొందరు అధికారులు, సిబ్బంది వ్యవహారశైలి విరుద్ధంగా మారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేఎంసీలోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పారిశుధ్య తదితర విభాగాల పనితీరుపై పలు ఫిర్యాదులు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కార్యాలయం ఎదుటే ఇరిగేషన్ కాలువను ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు రావడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### కార్యాలయం ఎదుటే కబ్జా!

కేఎంసీ కార్యాలయం ఎదుటే కాలువను ఆక్రమించి షాపు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇరిగేషన్ పరిధిలోని కాలువ ఆక్రమణపై సంబంధిత విభాగాలు చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. కేఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఆక్రమణల పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.







బైపాస్ లో రోడ్డు ఆక్రమించి నిర్మాణం

### టౌన్ ప్లానింగ్‌పై ఆరోపణలు

నగరంలో వాణిజ్య ప్రకటనల బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలంటే సంబంధిత అనుమతులు, నిబంధనల ప్రకారం ఫీజుల చెల్లింపు అవసరం. అయితే వైరా రోడ్, ముస్తఫా నగర్ జంక్షన్, కామన్ బజార్, జిల్లా పరిషత్ సెంటర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో భారీ హోర్డింగ్‌లు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసినా వాటిపై పూర్తిస్థాయి అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కొన్ని ప్రకటనలు ఏజెన్సీల పేరుతో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్డుల విషయంలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటిపై కేఎంసీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని నగరవాసులు కోరుతున్నారు.

### ఏళ్లుగా పెండింగ్‌లో అక్రమ నిర్మాణాల ఫిర్యాదులు

మామిళ్లగూడెం పోస్టల్ కాలనీ ఎదురుగా డోర్ నంబర్ 10-2-169కు సంబంధించి 2021లోనే అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు వచ్చినట్లు సమాచారం. ఐదేళ్లు దాటినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అదే విధంగా 2019లో మేదరబజార్ ప్రాంతంలోని భారీ నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ తాజాగా ఆ వ్యవహారం పరిష్కారమైనట్లు సమాచారం. ఈ ఫిర్యాదులపై ఏ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు? ఎవరి ఆదేశాలతో పరిష్కరించారు? అన్న విషయాలను కేఎంసీ అధికారులు ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### పార్కింగ్ లేకుండానే నిర్మాణాలు?

మామిళ్లగూడెం, వైరా రోడ్, బైపాస్ ప్రాంతాల్లో అనుమతులు, పార్కింగ్ సౌకర్యాలపై నిబంధనలు పాటించకుండా కొన్ని నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఇరిగేషన్ కాలువలపై కూడా ఆక్రమణలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కాలువ మూసి వేసి రోడ్డు పై నిర్మాణం

పాత మున్సిపల్ భవనం ఎదురుగా ఉన్న ఓ బిర్యానీ హోటల్‌లో సెల్లార్‌ను వంటగదిగా వినియోగిస్తున్నట్లు, వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి నిర్మాణాలపై కేఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

### రోడ్లు.. డ్రెయిన్లు.. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

నగరంలోని ప్రధాన రహదారుల వెంట ఫుట్‌పాత్‌లు, డ్రెయిన్లు ఆక్రమణకు గురవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. వైరా రోడ్‌లోని కొన్ని కార్పొరేట్ బంగారు నగల దుకాణాలు, వస్త్ర దుకాణాలు, ఆస్పత్రులు తమ అవసరాలకు అనుగుణంగా ఫుట్‌పాత్‌లను మార్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముస్తఫానగర్, వైరా రోడ్, పాత సీపీఎం కార్యాలయం పరిసరాలు, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో రహదారి స్థలాలు సైతం ప్రైవేటు వినియోగంలోకి వెళ్లినట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజల కోసం ఉద్దేశించిన రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రెయిన్లు ఇలా ఆక్రమణకు గురవుతుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఆస్తి పన్నుల రాయితీలపై ప్రశ్నలు

వైరా రోడ్‌లోని బిలీఫ్ ఆస్పత్రి, ఎన్ఎస్‌టీ రోడ్‌లోని డాక్టర్ బొల్లికొండ శ్రీదేవి ఆస్పత్రి భవనం, జీవీ మాల్, స్టేషన్ రోడ్‌లోని కాళ్ల కాంప్లెక్స్ తదితర ఆస్తులకు సంబంధించి భారీగా ఆస్తి పన్ను రాయితీలు కల్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అలాగే కొన్ని మద్యం దుకాణాలు, టీ హబ్‌లకు నకిలీ ఇంటి నంబర్లు కేటాయించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఏ నిబంధనల ప్రకారం పన్ను రాయితీలు ఇచ్చారు? ఇంటి నంబర్లు ఎలా కేటాయించారు? అన్న అంశాలపై కేఎంసీ రెవెన్యూ విభాగం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### ఫంక్షన్ హాళ్లపై చర్యలు ఎప్పుడు?

నగరంలో అనుమతులు, పార్కింగ్, ఫైర్ సేఫ్టీ తదితర నిబంధనలు పాటించకుండా కొన్ని ఫంక్షన్ హాళ్లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్ద ఎత్తున ప్రజలు చేరే ప్రాంతాల్లో భద్రతా నిబంధనల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

### పారిశుధ్య విభాగంపైనా ఆరోపణలు

స్వచ్ఛ భారత్ కార్యక్రమాల అమలుతో పాటు పారిశుధ్య విభాగంలో డిజిటల్ వ్యవస్థల వినియోగానికి సంబంధించిన వ్యవహారాలపై కూడా అనేక ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై సమగ్రంగా విచారణ జరిపితే మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

### మంత్రి లక్ష్యానికి అధికారులు సహకరించాలి

ఖమ్మం నగరానికి జాతీయ రహదారుల అనుసంధానం, విద్య, వైద్యం, వ్యాపార రంగాల విస్తరణతో అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. నగరానికి ఉన్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత కేఎంసీపై ఉంది.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, కేఎంసీలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శక పాలన అందించాల్సిన అవసరం ఉంది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పారిశుధ్యంతో పాటు ఇతర విభాగాల్లో వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని నగరవాసులు కోరుతున్నారు.

(మరికొన్ని వివరాలు మరో కదనం లో)

# వెలిగొండకు తొలగుతున్న అడ్డంకి



- చివరి దశకు చేరిన టీబీఎం తొలగింపు

**టీ మీడియా , ఆగష్టు 16 , మార్కాపురం :**
మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు గ్రామంలో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే రెండో సొరంగం తవ్వేందుకు వినియోగించిన టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) తొలగింపు పనులు చివరి దశకు చేరుకున్నాయి. 18.89 కిలోమీటర్ల మేర రెండో సొరంగం తవ్వేందుకు ఈ యంత్రంతో 2009లో పనులు ప్రారంభించారు. 11.84 కిలోమీటర్ల మేర తవ్వకం పనులు 2019 వరకు కొనసాగాయి. ఆ తర్వాత యంత్రంలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దీంతో పనులు నిలిపివేశారు.

సహజసిద్ధంగా బ్లాస్టింగ్ చేసి కాంక్రీట్ పూతతో మిగతా పనులు చేపట్టారు. ఇవి దాదాపు పూర్తికాగా, ఈ నెల 22న ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఇక్కడ చిక్కుకుపోయిన యంత్రం బయటకు తీయడం సవాల్?గా మారింది. 180 మీటర్ల పొడవు, వెయ్యి టన్నులకుపైగా బరువు ఉన్న ఈ యంత్రాన్ని బయటకు తీసుకురావాలంటే ముక్కలుగా చేసి తరలించడం తప్ప మరో మార్గం లేదు. ఈ పనిని మే 29న ప్రత్యేక నిపుణులకు అప్పగించారు. వారు యంత్రం వెనుక వైపు నుంచి ఒక్కో భాగాన్ని వెల్డింగ్‌తో తొలగించడం ప్రారంభించారు. అనంతరం ఆ భాగాలను టిప్పర్‌లో బయటకు తీసుకొస్తున్నారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. చివరగా టీబీఎంలో ఉండే కట్టర్ హెడ్‌ను తొలగించాల్సి ఉంది. ఇందుకోసం డైమండ్ కటింగ్‌లో నైపుణ్యం ఉన్న కార్మికులను తీసుకొచ్చారు. వారంలోగా పనులన్నీ పూర్తిచేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూస్తామని ఈఈ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

### కార్మికుల భద్రతకు అధికారుల చర్యలు

మరోవైపు టన్నెల్‌లో పనులకు వెళ్లే కార్మికుల భద్రతకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. టన్నెల్‌లోకి వెళ్లే ప్రతి కార్మికుడికి ముందుగా ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్నారు. టీబీఎం తొలగింపు, గ్యాస్ కట్టింగ్ పనులు చేసే సిబ్బందికి ప్రత్యేక దుస్తులు, మాస్కులు, చెవుల రక్షణ పరికరాలు అందిస్తున్నారు. వాహనాల రాకపోకల కోసం ప్రతి 400 మీటర్లకు రెడ్ సిగ్నల్, వాహనాలు పక్కకు తప్పుకునే ప్రాంతాలు ఏర్పాటు చేశారు. కార్మికుల కోసం అంబులెన్స్‌తో పాటు మెయిన్ సైట్‌లో 24 గంటలూ వైద్యుడు అందుబాటులో ఉంటారని వెలిగొండ భద్రతా అధికారి మంజునాథ్ వివరించారు.

# విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన నవీన్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

- పరిహారం,ప్రయోజనాలపై మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్తా
- బాధ్యులను కఠినంగా శిక్షించాలి:
- కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు

**టీ మీడియా,ఆగస్ట్16,సింగరేణి(కారేపల్లి):**
వన్యప్రాణుల వేట కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చులకు బలై విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ బీట్ అధికారి బానోత్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు అన్నారు.నవీన్ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం,ఇతర ప్రయోజనాల విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.ఆదివారం కారేపల్లి మండలం వెంకట్యాతండాలోని మాజీ ఎంపీపీ బానోత్ దేవులా నాయక్ నివాసానికి వెళ్లిన గుత్తా వెంకటేశ్వరరావు నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.కుమారుడిని కోల్పోయిన దేవులా నాయక్‌ను ఓదార్చడంతో పాటు నవీన్ సతీమణి,పిల్లలు,ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా గుత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో



ఉన్న ఒక అటవీ ఉద్యోగి వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చులకు బలికావడం అత్యంత బాధాకరమన్నారు.నవీన్ మృతి తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు.అటవీ సంపద,వన్యప్రాణుల సంరక్షణ కోసం బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ నవీన్ ప్రాణాలు కోల్పోవడం విచారకరమని,ఆయన సేవలను మరువలేమన్నారు.నవీన్ మృతికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా అడవుల్లో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన రక్షణ కల్పించాలని కోరారు.నవీన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని,ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం,ఇతర ప్రయోజనాలు త్వరితగతిన అందేలా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి అన్ని విషయాలను తీసుకెళ్తానని గుత్తా వెంకటేశ్వరరావు తెలిపారు.కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు జవ్వాజి శ్రీనివాసరావు,గుత్తా శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, డొంకెన రవీందర్, మణికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుడి చెమటకు తగిన వేతనం ఇవ్వాలి

- 20న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా

**టీ మీడియా,ఆగస్ట్16,సింగరేణి(కారేపల్లి):**
పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు నెలకు రూ.39,373 కనీస వేతనం అమలు చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.కనీస వేతనాల అమలు కోసం ఈ నెల 20న ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు సంఘటిత,అసంఘటిత రంగాల కార్మికులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం కారేపల్లి మండల కేంద్రంలో ఎస్.కె. ఖైరుద్దీన్ అధ్యక్షతన టీయూసీఐ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ కనీస వేతనాలకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వాలు అమలు చేయకపోవడంతో కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.కార్మికుడు,జీవిత భాగస్వామి,ఇద్దరు పిల్లలతో కూడిన కుటుంబ అవసరాలు,నిత్యావసర వస్తువుల ధరలు,విద్య,వైద్యం,నివాసం తదితర ఖర్చులను పరిగణనలోకి తీసుకొని కనీస వేతనాన్ని శాస్త్రీయంగా నిర్ణయించాలని కోరారు.ఆ ప్రాతిపదికన కార్మికులకు నెలకు రూ.39,373 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.కనీస వేతనం కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, అది చట్టబద్ధమైన హక్కని స్పష్టం చేశారు.ఉత్పత్తి, సంపద సృష్టిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందాల్సిందేనన్నారు.ధరలు నిరంతరం పెరుగుతున్నా కార్మికుల వేతనాలు మాత్రం అందుకు అనుగుణంగా పెరగడం లేదని విమర్శించారు.కార్మికుల హక్కులను విస్మరించి యజమానులకు అనుకూలమైన విధానాలను అమలు చేయడం సరికాదన్నారు. కార్మికులు ఆరోగ్యంగా,గౌరవప్రదంగా కుటుంబాలను పోషించుకునే స్థాయిలో కనీస వేతనాలు ఉండాలని పేర్కొన్నారు.ఈ నెల 20న ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా కార్మికుల వద్ద సమావేశాలు,ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కారేపల్లి టీయూసీఐ ప్రాంత కార్యదర్శి ధరావత్ సక్రు,నాయకులు బాదావత్ వీరు,గద్దల రవి,బర్మావత్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.